క్లుప్తంగా

వాసవీ మాత శోభాయాత్ర



అమ్మవారికి పల్లకీ సేవ

కొడంగల్: వాసవి కన్యకా పరమేశ్వరీ మాత జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి నగరేశ్వర స్వామి ఆలయం వరకు శోభాయాత్ర, పల్లకీ సేవ చేశారు. ఆట పాటలతో అమ్మవారిని కీర్తించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఆర్యవైశ్య సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కటుకం శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, కటుకం వెంకటేశ్, పవన్‌కుమార్, ఎల్లయ్య గుప్తా, విశ్వనాథం, పూరి శేఖర్ తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, రైతులకు ఇబ్బంది కలగకుండా, నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీ వెంకట్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వారంలో రెట్టింపు ధరలు

పోటీపడుతున్న బీర, పచ్చిమిర్చి



మార్కెట్లో బీర కొనుగోలు చేస్తున్న మహిళ

ధారూరు: పచ్చిమిర్చి ధరతో బీరకాయలు పోటీ పడుతున్నాయి. గత వారం బీర కిలో రూ.60 ఉండగా.. ప్రస్తుతం 100కు చేరింది. మిర్చి కిలో రూ.100 నుంచి 120కి చేరి, కోయకుండానే ఘాటెక్కించింది. వారం పదిరోజులకే రెట్టింపవుతున్న ధరలతో ఏం కొని తినేటట్లు లేదని కొనుగోలు దారులు వాపోతున్నారు. ధరలు పెరుగుతున్నా.. కొనక తప్పడం లేదని, కిలోకు బదులు అరకిలో, పావు కిలోతో సరిపెట్టుకుంటున్నామని పలువురు మహిళలు తెలిపారు.

నూతన బోరు ఏర్పాటు



పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ పద్మ

దోమ: గ్రామంలో తాగునీటి సమస్య తలత్తెకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని బాస్‌పల్లి మాజీ సర్పంచ్ పద్మ అన్నారు. మండల పరిధి బాస్‌పల్లి గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో.. మాజీ సర్పంచ్ అనంతయ్యతో కలిసి ఆమె ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి, నీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారుల సహకారంతో శనివారం ఎస్సీ కాలనీలో నూతన బోరు వేసినట్లు పద్మ తెలిపారు. ఇందులో కాలనీ వాసులు కృష్ణయ్య, వార్డు మాజీ సభ్యుడు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిపశువులు మృతి



ఘటనా స్థలంలో పశువుల కళేబరాలు

బొంరాస్‌పేట: పొలంలో మేత మేస్తున్న మూడు పాడిపశువులు వేలాడుతున్న విద్యుత్ తీగకు తగిలి మృత్యువాత పడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి మైసమ్మగడ్డ తండాకు చెందిన దిగావత్ వాలిబాయి.. తన శనివారం పశువులను పొలంలో మేతకు వదలగా.. అవి మేత మేస్తూ.. వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ రూ.1.50లక్షలకు పైగా ఉంటుందని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.

రాకపోకలు ఎట్లా?

- ఒకవైపు రోడ్డు.. మరోవైపు కంకర
- దూరం 1.2 కిలో మీటర్లు
- నిర్మాణ వ్యయం రూ.2.80కోట్లు
- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని సీసీరోడ్డు



ఒకవైపు సీసీరోడ్డు, మరోవైపు మట్టితో కూడిన కంకరరోడ్డు

కుల్కచర్ల: ప్రజల, రవాణా సౌకర్యార్థం మండల కేంద్రం ప్రధాన చౌరస్తా నుంచి గ్రామ శివారు వరకు 1.2 కిలో మీటర్ల దూరానికి డివైడర్‌తో కూడిన సీసీ డబుల్ రోడ్డు నిర్మాణానికి 2022లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు రూ.2కోట్ల 80లక్షల నిధులతో అదే ఏడు మార్చి 2వ వారంలో పనులు ప్రారంభించింది. కానీ.. ఏడాది పూర్తయ్యే నాటికి ఒక వైపు మాత్రమే సీసీ వేసి, మరోవైపు కంకర పోసి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు మొత్తం.. ఒకవైపు నుంచే పరుగులు తీస్తుండటంతో ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా సింగిల్ రోడ్డులో రాకపోకలు ఎట్లా కొనసాగించాలని వాహనదారులు వాపోతున్నారు.

దుమ్ముధూళితో ఇబ్బంది

రహదారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా.. మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణపు పనులు నత్తనడకన నడుస్తున్నాయని, పనులు చేపట్టి రెండేళ్లు అయినా పూర్తి కాలేదని వ్యాపారులు పేర్కొన్నారు. రోడ్డు పూర్తి చేయడానికి ఇంకా ఎంతకాలం పడుతుందని అసహనం వ్యక్తంచేస్తున్నారు. కంకర రోడ్డులో కొద్దోగొప్పో వెళ్తున్న వాహనాలతో ఇబ్బందిగా ఉందని, దుమ్ముధూళి గాలిలో లేచి వెనకాల వస్తున్న వాహనదారులతో పాటు, ప్రయాణికులు, రోడ్డు పక్కన దుకాణదారులకు, నివాసం ఉన్నవారికి ఇబ్బందిగా ఉందని పలువురు పేర్కొన్నారు.

పాలకులకు పట్టదా?

మండల కేంద్రం అంటే పరిసర ప్రాంత గ్రామాలకు కూడలి. అలాంటి ప్రాంతంలో రోడ్డు నిర్మాణంలో ఇంత అలసత్వం జరుగుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే.. ఇక పల్లెల దారుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సీసీరోడ్డు నిర్మాణం పూర్తిచేసి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అసంపూర్తి రోడ్డుతో..



రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడిచినా పూర్తి కాలేదు. ఒక వరుస పూర్తి చేసి, మరోవైపు కంకర పోసి వదిలేశారు. దీంతో మండల కేంద్రంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సింగిల్ రోడ్డులో పరుగులు తీస్తున్న వాహనాలతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, మరోవైపు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– రమేష్, వాహనదారుడు

వారంలో పనులు ప్రారంభం

నిధులు విడుదల సమస్య, ఎన్నికల నిర్వహణ తదితర కారణాల వలన రోడ్డు నిర్మాణంలో ఆలస్యం జరిగింది. వారంలోపు సీసీరోడ్డు నిర్మాణపు పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఆర్అండ్‌బీ, ఏఈ, కుల్కచర్ల

తారుపోయి.. కంకర తేలి



గడ్డమీది గంగారం గ్రామ సమీపంలో బీటీరోడ్డు దుస్థితి

అధ్వానంగా గంగారం బీటీరోడ్డు

ధారూరు: దశాబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోని బీటీరోడ్డు.. కంకరతేలి, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ధారూరు మండల పరిధి కుక్కింద ఉన్నత పాఠశాల నుంచి గడ్డమీది గంగారం, రుద్రారం సమీప కోట్‌పల్లి ప్రాజెక్టు వరకు ఉన్న బీటీ.. పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయింది. పగటి వేళలో ఎలా ఉన్నా.. రాత్రిపూట ఈ దారిలో పయనించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ రోడ్డును రీబీటీ చేయడానికి నిధులు మంజూరు అయ్యాయని అధికారులు ప్రకటించారే తప్ప.. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. వర్షాలు పడితే మరింత అధ్వానంగా మారుతుందని.. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డును మరమ్మతు లేదా కొత్తగా నిర్మించడమే చేయాలని గంగారం ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

‘కొండా’ విజయం ఖాయం

బంట్వారం: చేవేళ్ల పార్లమెంటు నియోజకవర్గ గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ కోట్‌పల్లి మండలం సీనియర్ నాయకుడు ఓగులాపూర్ రాజు ధీమా వ్యక్తంచేశారు. శనివారం ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారని, వారి మద్దతుతో కొండా భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు



పరిగి: అమ్మవారి పారాయణంలో మహిళలు



అనంతగిరిలో.. చైర్‌పర్సన్ మంజుల



అనంతగిరి: శోభాయాత్రలో మహిళలు

అనంతగిరి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్ వాసవీ కన్యకా పరమేశ్వరి మాత ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రామమందిరంలో అమ్మవారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని, పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పట్టణంలో అమ్మవారి శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల దంపతులు, కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మాలె లక్ష్మణ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మధుసుదన్ గుప్తా, మహిళా అధ్యక్షురాలు సువర్ణ, ప్రధాన కార్యదర్శి కిరణ్, కోశాధికారి మల్లేషం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: వాసవిమాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ఉదయం ఈశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కృష్ణకుమార్, విజయ్‌కుమార్, నారాయణ, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో ర్యాంకుల పంట

అన్ని రంగాల్లో రాణించేందుకు అర్హత పొందిన విద్యార్థులు

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అబ్బురపరిచే ర్యాంకులు సాధించారు. వికారాబాద్ పట్టణంలోని ఎస్ఎల్‌బీ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులకు 10వేల లోపు ర్యాంకులు వచ్చాయి. సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థి విజయ్‌కుమార్.. ఇంజినీరింగ్ విభాగంలో 101.44మార్కులతో 758వ ర్యాంకు పొందాడు. యాలాల మండల పరిధి బెన్నూరుకు చెందిన నవ్యరెడ్డి అగ్రికల్చర్ విభాగంలో 864 రాష్ట్ర స్థాయి రాంకును సొంతం చేసుకుంది.



రాధ
2,544 ర్యాంకు



భార్గవి
4,804 ర్యాంకు



అశ్విత
6,149 ర్యాంకు



జి.జాగృతి
8,222 ర్యాంకు



తనుశ్రీ
8,954 ర్యాంకు

ఎస్ఎల్‌బీ విద్యార్థినుల హవా

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల గురుకుల కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులకు ఈఏపీసెట్ ఫలితాల్లో 10వేల లోపు ర్యాంకులు వచ్చాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమ్మ తెలిపారు. మొత్తం 17మంది ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. అగ్రికల్చర్, ఫార్మసి తదితర విభాగాల్లో.. ఎస్.రాధ 85.82 మార్కులతో 2,544 ర్యాంకు, భార్గవి 79.17 మార్కులతో 4,804 ర్యాంకు, అశ్విత 76.5 మార్కులతో 6,149 ర్యాంకు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. వీరితో పాటు జి.జాగృతి 8,222, తనుశ్రీ 8,954, వార్ల అశ్విత 9,924, పావని 12,495, అక్షిత 12,936, చింతకింది త్రిష 14,981, విద్య 15,854, అశ్విని 17,067, హరిణి 17,733, స్నేహ 28,472 ర్యాంకు రాబట్టినట్లు ప్రిన్సిపాల్ ప్రకటించారు. విద్యార్థినులు ఇంత చక్కగా ఉత్తమ ర్యాంకులు పొందడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అధ్యాపక బృందం, తల్లిదండ్రులు అభినందించారు.



వార్ల అశ్విత
9,924 ర్యాంకు

ఇంజినీరింగ్‌లో మెరుపు



విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌లోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన నేనావత్ విజయ్‌కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో 101.44మార్కులతో 758వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయదేవ్, కరస్పాండెంట్ కృష్ణారెడ్డి అధ్యాపకులు శివరాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామాంజనేయులు, రవీందర్‌రెడ్డిలు విద్యార్థిని శాలువాతో సన్మానించి, అభినందించారు.

అగ్రికల్చర్‌లో.. 18,758 ర్యాంకు



అంజలి

వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన అంజలి అగ్రికల్చర్ విభాగంలో 18,758 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేశ్వరస్వామి, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో



తల్లిదండ్రులతో నవ్యరెడ్డి

యాలాల: ఈఏపీసెట్ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. బెన్నూరు గ్రామానికి చెందిన ప్యాట శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీ దంపతుల రెండో కూతురు నవ్యరెడ్డి .. అగ్రికల్చర్ విభాగంలో 864 రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. నవ్య తల్లిదండ్రులు ప్రైవేటు టీచర్లుగా పనిచేస్తున్నారు. నవ్య.. ఇంటర్‌లో (బైపీసీ) రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా.. ప్రస్తుత ఈఏపీసెట్ అర్హత పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు పొందడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

శాస్త్రవేత్తనవుతా: నవ్యరెడ్డి



ఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. వ్యవసాయ ఆధారిత కుటుంబం కావడంతో అగ్రికల్చర్ విభాగంలో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాను. వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చేలా పరిశోధనలు చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతా. శాస్త్రవేత్తనవుతా. అందుకు నా కుటుంబ సభ్యుల అండ మెండుగా ఉంది.

బీసీల రిజర్వేషన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచి ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గౌండ్ల కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌండ్ల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన మాట నిలబెట్టుకునే చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్‌లను స్థానిక సంస్థల్లో 22 నుంచి 42శాతంకు పెంచాలన్నారు. బీసీల రిజర్వేషన్‌లను 50 శాతం పెంచుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఓబీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే బీసీల రిజర్వేషన్‌లను పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. వెంటనే బీసీ జనగణన చేయించి బీసీ లెక్కలు తేల్చాలన్నారు. జనాభాలో సగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీల జనాభా ప్రకారం రావాల్సిన రిజర్వేషన్లను కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ తరఫున బీసీ సంఘాలను ఏకం చేసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణమోహన్, మానిక్యం, మహేందర్ తదితరులు ఉన్నారు.

పత్తి రైతుకు నకిలీ బెడద

- అనుమతి లేని బీటీ– 3 విత్తనాలు అంటగడుతున్న వ్యాపారులు
- గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో విక్రయాలు
- నష్టపోతున్న అన్నదాతలు

షాబాద్: జిల్లాలో పత్తి రైతులను నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. అనుమతి లేని బీటీ– 3 విత్తనాల కారణంగా దిగుబడులు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విత్తన ఎంపికపై అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు, దళారులు వీటిని అంటగడుతున్నారు. వారం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలకు చెక్ పెట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉద్దెర పేరుతో ఎర..

వివిధ ప్రాంతాల నుంచి రహస్యంగా అనుమతి లేని బీటీ– 3 పత్తి విత్తనాలు తీసుకొస్తున్న దళారులు ఉద్దెర పేరుతో రైతులకు అమ్ముతున్నారు. మంచి దిగుబడి వస్తుందని, కలుపు తీయకుండా మందులు పిచికారీ చేయొచ్చని ప్రచారం చేస్తున్నారు. ఇంటికి వచ్చి విత్తనాలు అందజేయడం, డబ్బులు కూడా పంట వచ్చిన తర్వాత ఇవ్వండి అని చెప్పడంతో కొంతమంది రైతులు వీటిని తీసుకుంటున్నారు. అనుమతి లేని బీటీ– 3 విత్తనాలతో అనేక దుష్పరిణామాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విత్తనాలు వేస్తే నేల నిస్సారం అవుతుందని, పంటల దిగుబడి రాదని, మనుషుల ఆరోగ్యంపై సైతం ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. అయినా దళారులు మాత్రం దందా కొనసాగిస్తున్నారు. గ్రామాల్లోని విత్తనాల దుకాణాలు, కొంతమంది ఏజెంట్ల ద్వారా వీటిని విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు స్పందించి రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా చూడాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏఈ ఎండీ. అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌడాపూర్ మరికల్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో విద్యుత్ తీగలు సరిచేయడం, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9:00 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అంతరాయం కలగనున్నట్లు వెల్లడించారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

షెడ్‌ను తొలగించాలి

కమిషనర్‌కు ఫిర్యాదు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని సాయిరెడ్డి చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్‌ను తొలగించాలని కోరుతూ కొత్తూరు తండావాసులు శనివారం కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండా సమీపంలోని సాయిరెడ్డి చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్‌లో సర్వే నంబర్ 83లో కొంతమంది అనుమతులు లేకుండా షెడ్డును ఏర్పాటు చేసి వాటర్ ఫిల్టర్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సర్వే నంబర్ 66లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్‌లను కూడా తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో రెడ్యా, రాజు, బాలు, శ్రీధర్, గోపాల్ పాల్గొన్నారు.

ధరణి సమస్యలకు పరిష్కారమేదీ?

బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ హయాంలో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడిన ధరణి సమస్యలు కాంగ్రెస్ పాలనలో తీరుతాయని ఆశిస్తే మరింత జఠిలంగా మారుతున్నాయని బీజేపీ యువ నాయకుడు ఎం.వైభవ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. ధరణితో రైతులు ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని పూర్తిగా తొలగిస్తామని లేదా సరిచేస్తామని చెప్పిన ఆ పార్టీ నేతలు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనికి తోడు అప్పట్లో ఉన్న ధరణి ఆప్షన్లను తొలగించి మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం ఈ ధరణి వెబ్‌సైట్ ద్వారా రైతులకు సంబంధించిన భూమి వివరాలను తెలుసుకునే ఈసీ, రిజిస్ట్రేషన్ సేల్ డీడీ డ్యాక్యుమెంట్‌లు కూడా డౌన్‌లోడ్ కావటం లేదన్నారు. కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైనా.. ధరణి వెబ్‌సైట్‌లోని ప్రొహిబీటెడ్ జాబితాలో నుంచి తొలగించటం లేదన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి, ప్రజల మధ్య భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధరణిపై ఏదో ఒక నిర్ణయం తీసుకొని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎర్తింగ్ తీగ తగిలి మేక మృతి



ఎర్తింగ్ తీగ వద్ద మేక కళేబరం

పెద్దేముల్: ఎర్తింగ్ తీగ తగిలి మేక మృత్యువాత పడిన సంఘటన ఆత్కూర్ గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న 15కేవీ మినీ ట్రాన్స్ ఫార్మర్ నుంచి ఎర్తింగ్ తీగను అమర్చారు. కానీ చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో గోపాల్‌కు చెందిన మేక.. మేతకోసం వెళ్లి, ప్రమాదవశాత్తు తీగకు తగిలి మృత్యువాత పడింది. ఈ ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో కూడా ఆవుకు ఎర్తింగ్ తగిలిందని, కానీ ప్రాణహాని తప్పిందని తెలిపారు. ఎర్తింగ్ సపోర్ట్ సరిగా పనిచేయకపోవడం వలనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. అప్పుడప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిప్పు రవ్వలు ఎగిసి పడతాయని తెలిపారు. ఇదే ఎర్తింగ్ మనుషులకు తగిలే ఎలా అని ప్రశ్నించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, ఎర్తింగ్‌కు మరమ్మతు చేయాలని విద్యుత్ అధికారులను కోరినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆన్‌ఆఫ్ ఏర్పాటు చేసి, రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ అంజిలప్ప మాట్లాడుతూ.. 15కేవీ బుడ్డిని ఇక్కడి నుంచి తరలించాలని విద్యుత్ అధికారులను కోరారు. ఇదే విషయమై ఏడి ఆదినారాయణను వివరణ కోరగా.. సమస్యను పరిశీలించి, పరిష్కరిస్తామని వెల్లడించారు.